క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

కమ్మర్‌పల్లి: ధాన్యం కొనుగోళ్లను వారం రోజుల్లో పూర్తి చేయాలని భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య సూచించారు. బుధవారం మండలంలోని బషీరాబాద్‌లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కొనుగోళ్లు త్వరగా పూర్తి చేసి ధాన్యాన్ని మిల్లులకు పంపాలని నిర్వాహకులకు సూచించారు. ఆయనవెంట ఏవో లావణ్య ఉన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): వడ దెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సిబ్బంది సూచించారు. ఆర్మూర్ మండలం మగ్గిడి, ఖానాపూర్ గ్రామాల్లోని ఇటుక బట్టీల వద్ద పని చేస్తున్న కార్మికులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ మాట్లాడుతూ.. ఎండ నేరుగా శరీరానికి తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఓఆర్ఎస్ ద్రావణాన్ని సేవించాలని సూచించారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే బాలామృతం, కోడిగుడ్లను తీసుకోవాలన్నారు. అలాగే గర్భిణులకు ఐరన్, క్యాల్షియం మాత్రలను అందజేశారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



జక్రాన్‌పల్లి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ రమేశ్‌రెడ్డిని కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లా సహకార శాఖ కార్యాలయంలో రమేశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సహకార సంఘాల్లో రైతులు తీసుకున్న పంట రుణాలను మొదటి ప్రాధాన్యతగా మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. సీఎంతోపాటు స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీబీ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కుల గణన హామీని అమలు చేయాలి

బోధన్: ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టాలని, ఆ తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బగోని లక్ష్మీనర్సయ్య గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 43 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు ద్వారా బీసీలు, ఎంబీసీలకు వర్గీకరణతో కూడిన బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని పేర్కొన్నారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ చట్ట సభలకు రాజకీయపరంగా రిజర్వేషన్లు లేక పోవడం వెనుకబాటుకు కారణమైందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులు



వర్ని: ఉపాధ్యాయ వృత్తి అన్ని వర్గాల వారికి మార్గదర్శకమని, ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. మండల పీఆర్టీయూ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు ప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా వర్నిలో బుధవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంతో చర్చించి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి కమలాకర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి పీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

నవీపేట: గ్రామాల్లో ఇంటి పన్ను బకాయి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో నాగనాథ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయలంలో బుధవారం నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమవనున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలను వేగవంతం చేయాలన్నారు. హరిత మొక్కల పెంపకంతోపాటు నర్సరీల్లోని మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డా ఎస్సారెస్పీ

- ప్రాజెక్ట్ లోపల నిషిద్ధ ప్రదేశంలో యథేచ్ఛగా సిట్టింగ్‌లు
- బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాల్లో ఖాళీ సీసాలు



ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో ఖాళీ బీరు సీసాలు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టును మందుబాబులు అడ్డాగా చేసుకుని రెచ్చిపోతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటి మట్టం భారీగా తగ్గడంతో బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం మైదానంలా మారింది. ప్రాజెక్ట్ ఆనకట్ట నుంచి మూడు, నాలుగు కిలోమీటర్ల మేర దూరం వరకు నీరు లేకుండాపోవడంతో ఆ ప్రాంతాన్ని మందు బాబులు అడ్డాగా చేసుకుని చిందులు వేస్తున్నారు. ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం నిషిద్ధ ప్రాంతంగా ఉంటుంది. ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు మాత్రమే అటు వైపు ఉంటారు. మధ్యాహ్నం నుంచి మొత్తం నిశ్శబ్దంగా మారుతుంది. అలాంటి ప్రదేశంలో నిత్యం మందు పార్టీలు జోరుగా సాగుతున్నాయి. కొందరు ఏకంగా అడ్డాలు చేసుకుని పేకాటను జోరుగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం బాల్కొండ, ముప్కాల్ మండలాలతోపాటు నందిపేట్, డొంకేశ్వర్, ఆర్మూర్ మండలాల పరిధిలో ఉంటుంది. దీంతో ఏ మండలానికి చెందిన పోలీసులు కూడా దృష్టి సారించలేక పోతున్నారు. ఫలితంగా ఎస్సారెస్పీ భూముల్లో మందు బాబుల ఆగడాలు మూడు పెగ్గులు.. ఆరు బీర్లు అన్న చందంగా సాగుతున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద అసాంఘిక కార్యకలాపాలు జోరుగానే సాగుతున్నాయి. ప్రాజెక్ట్ ఆనకట్ట నుంచి మొదలుకుని బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం వరకు ఏ ప్రాంతాన్నీ వదిలిపెట్టడం లేదు. గతంలోఎస్సారెస్పీ ఆనకట్టపై అవుట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినప్పటికీ మధ్యలోనే ఎత్తేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీస్ సిబ్బందే జంటల వద్ద డబ్బులు వసూలుకు పాల్పడ్డారనే ఆరోపణలు అప్పట్లో జోరుగా వినిపించాయి. దీంతో అవుట్ పోలీస్ స్టేషన్‌ను ఎత్తివేశారు. అధికారులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

'బీడీ టేకేదార్ వేధిస్తున్నారు'



టేకేదార్ వైకుంఠంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీడీ కార్మికులు

డిచ్‌పల్లి: ఇందల్వాయి మండల కేంద్రంలోని చార్‌బాయ్ బీడీ కార్ఖానా టేకేదార్ వైకుంఠం తమను వేధిస్తున్నాడని బీడీ కార్మికులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సదరు బీడీ కంపెనీ కార్యాలయానికి పెద్దసంఖ్యలో బీడీకార్మికులు తరలివచ్చి యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో కంపెనీకి వచ్చిన టేకేదార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీడీ కార్మికులు మాట్లాడుతూ.. తాము చేసిన బీడీలను తక్కువగా నమోదు చేసి డబ్బులు తక్కువగా ఇస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకు, తంబాకు తూకం వేయకుండానే చేతితో వేస్తున్నాడని, ఇదేమని అడిగితే దురుసుగా వ్యవహరిస్తున్నాడని, బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. పీఎఫ్ విషయంలోనూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. టేకేదార్ వైకుంఠంను తొలగించి వేరే వారిని నియమించాలని వినతిపత్రం అందజేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జీలుగ విత్తనాల పంపిణీ



ఉప్లూర్‌లో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ మల్లయ్య



పచ్చలనడ్కుడలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో నర్సయ్య

కమ్మర్‌పల్లి/వేల్పూర్/మాక్లూర్: భూసారాన్ని పెంచే జీలుగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆయా మండలాల్లో విత్తనాలను పంపిణీ చేశారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ, రామన్నపేట్ సొసైటీల్లో మండల వ్యవసాయాధికారి నర్సయ్య, మాక్లూర్‌లో వ్యవసాయాధికారిణి పద్మ విత్తనాలను పంపిణీ చేశారు. ఉప్లూర్‌లో సొసైటీ చైర్మన్ చైర్మన్ దేవేందర్, ఏవో లావణ్య, ఏఈవోలు కావ్య, పద్మ, సీఈవో శంకర్, రైతులు గంగారెడ్డి, హరీశ్, రాజేశ్వర్, వేల్పూర్ మండలంలో సొసైటీల కార్యదర్శులు రణవీర్, స్వామి, ఏఈవోలు షబ్బీర్, వినయ్ పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డి జయంతి



నివాళులు అర్పిస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలో బుధవారం భాగ్య సాహెబ్ భాగ్యరెడ్డి వర్మ 136 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేఏసీ అధ్యక్షుడు, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్ మాట్లాడుతూ.. సమాజంలో అస్పృశ్యత నివారణ, అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించిన భాగ్యరెడ్డివర్మ సేవలు మరవలేనివన్నారు. విద్య ద్వారానే ఆత్మగౌరవం, మేధస్సు వికసిస్తాయని నమ్మి మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి పూలే విద్య విప్లవాన్ని హైదరాబాద్ రాష్ట్రంలో కొనసాగించిన భాగ్యరెడ్డి గొప్ప పోరాట యోధుడన్నారు. అలాంటి నాయకుని విగ్రహాన్ని ప్రభుత్వం ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీ చైర్మన్ గంట సదానందం, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ మూగ ప్రభాకర్, షెట్పల్లి నారాయణ, పింజ భూమేశ్, పూర్ణచందర్, పింజ సుదర్శన్, వసంత్‌రావు, అంగులి మాల, పులి సాయిరాం, ఆవుల అశోక్ పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి జలాభిషేకం

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి)లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మ తల్లికి జలాభిషేకం నిర్వహించారు. అంతకుముందు బినోల నుంచి తీసుకొచ్చిన గంగ జలంతో బోర్గాం(పి) చౌరస్తాలో ఉన్న రామాలయం నుంచి గంగమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని గంగమ్మ తల్లిని ప్రార్థించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శేఖర్, కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా అధ్యక్షుడు పసూల శ్రీనివాస్, నాయకులు జనార్దన్, గంగాధర్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



గంగాజలాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

భైరాపూర్‌లో పోచమ్మతల్లి జాతర



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

మోపాల్: మండలంలోని భైరాపూర్ గ్రామపరిధిలో పోచమ్మ తల్లి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగుండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. కుస్తీ పోటీలకు చుట్టుపక్కల గ్రామాలతోపాటు మహారాష్ట్ర నుంచి మల్లయోధులు తరలివచ్చారు. విజేతలకు ఆలయ కమిటీ, గ్రామ ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. బడాపహాడ్ వద్ద గల చిట్టాపూర్‌కు చెందిన మల్లయోధుడు ఉత్తమ ప్రతిభ కనబర్చి వెండి కడియం గెలుపొందారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రతాప్, వసంత్‌రావు, రాంనాథ్, రమేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ నల్ల సారిక



ఏవో ప్రవీణ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తూ..

ధర్పల్లి: మండల కేంద్రంలో ఎంపీపీ సారికాహనుమంత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సమావేశం ప్రారంభానికి ముందు.. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ చిత్రపటం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని సభ్యులు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రామడుగు, హొన్నాజీపేట్, ధర్పల్లి సొసైటీల్లో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో వెంకటేశ్ కోరారు. కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని పలువురు సభ్యులు కోరారు. ఆరు గ్యారంటీలు అమలు కావడం లేదని ఎంపీపీ సారిక హనుమంత్‌రెడ్డి సమావేశంలో మాట్లాడారు. వైస్ ఎంపీపీ కల్లెడ నవీన్, ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి, ఏపీవో రాజేశ్ పాల్గొన్నారు.

మొండిగోడలకు పరిమితం

- రుద్రూర్‌లో నిలిచిన బస్‌షెల్టర్ నిర్మాణ పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



రుద్రూర్ జవహర్ నగర్ కాలనీ వద్ద మొండి గోడలకే పరిమితమైన బస్ షెల్టర్

రుద్రూర్: మండలకేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో బోధన్ ప్రధాన రహదారి పక్కన చేపట్టిన బస్ షెల్టర్ పనులు మొండి గోడలకు పరిమితమయ్యాయి. జవహర్‌నగర్ కాలనీవాసులు వర్ని, బోధన్ వెళ్లాలంటే రోడ్డుపై ఎండలో నిలబడి బస్సు కోసం వేచి చూడాల్సి వస్తోందని గుర్తించిన స్వచ్ఛంద సంస్థ సంస్కార్ ప్లాన్ గతంలో బస్ షెల్టర్ నిర్మాణ పనులను ప్రారంభించింది. మూడు వైపుల గోడల నిర్మాణం పూర్తికాగా, సంస్థ కార్యకలాపాలు ముగియడంతో నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. బస్ షెల్టర్ నిర్మాణ పనుల అంశాన్ని స్థానికులు పలుమార్లు నాయకులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. గోడలపైన తాత్కాలికంగా రేకులు వేసి ఫ్లోరింగ్ చేస్తే ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని, అయినప్పటికీ అధికారులు, నాయకులు నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తూ బస్సు కోసం ఎదురు చూడాల్సివస్తోందని అంటున్నారు. అసంపూర్తిగా నిలిచిన బస్సు షెల్టర్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

మినీ ఎత్తిపోతల పథకం పరిశీలన



మాక్లూర్: మండలంలోని ధర్మోరా చెరువులో గుత్ప ఎత్తిపోతల నీటిని ఆధారంగా చేసుకుని చేపట్టిన మినీ ఎత్తిపోతల పథకం పనులను జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు బుధవారం పరిశీలించారు. రూ.11 కోట్ల 70 లక్షల వ్యయంతో బొంకన్‌పల్లి, ముల్లంగి (బి) గ్రామాల రైతులకు చెందిన 1100 ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా సంవత్సరకాలంగా పనులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆ పనులను జెడ్పీ చైర్మన్ పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఆయనవెంట జలంధర్‌రావు, పోశెట్టి, రైతులు ఉన్నారు.

'క్రిసెంట్'కు ఇంటర్నేషనల్ అవార్డు



అవార్డును చూపుతున్న కరస్పాండెంట్ జావిద్

బోధన్: పట్టణంలోని క్రిసెంట్ హైస్కూల్‌కు ఇంటర్నేషనల్ బ్రిలియన్స్ అవార్డు–2024 దక్కింది. పాఠశాల నిర్వహణలో అంకితభావం, వినూత్న పద్ధతుల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అంశాలను పరిగణనలోకి తీసుకొని న్యూ ఢిల్లీకి చెందిన హై ఫ్లెడ్జి మీడియా గ్రూప్ వారు 2024 ఏప్రిల్ 20న క్రిసెంట్ హైస్కూల్‌ను ఐబీఏ (ఇంటర్నేషనల్ బ్రిలియన్స్ అవార్డు–2024)కు ఎంపిక చేసింది. ఈ అవార్డును పోస్ట్ ద్వారా బుధవారం పంపించారని కరస్పాండెంట్ జావీద్ అలీ తెలిపారు. తమ పాఠశాలకు అంతర్జాతీయ స్థాయి అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం, ఉపాధ్యాయుల సమష్టి కృషి కారణంగా అవార్డు అందుకునే అవకాశం దక్కిందన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అశోక్, ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ సిబ్బందిని ఆదేశించారు. ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్, పిప్రి గ్రామాల ఆరోగ్య ఉప కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలు చిన్నారుల జాబితాను ముందుగానే సిద్ధం చేసుకుని ప్రతి ఒక్కరికీ టీకాలు వేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు విధిగి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వారివెంట ఆర్మూర్ సబ్ యూనిట్ అధికారి సాయి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

మోపాల్: రైతులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి మంగళ్‌పాడ్ నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రామేశ్వర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. అన్ని రకాల పంటలకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, ఎరువులు సరఫరా చేయాలన్నారు. రైతులకు వ్యవసాయ పరికరాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్లు 50శాతం సబ్సిడీపై ఇవ్వాలని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని, వడగళ్ల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రపు సాయాగౌడ్, నాయకులు దండు గంగమల్లు, గంగారాం, గంగాధర్, సాయిలు, రవి, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

■ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి



ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామివారి జన్మోత్సవాన్ని(జయంతిని) బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవాదాయశాఖ అధికారులు, ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగించారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఆలయ ఈవో వేణు, కార్యదర్శి రఘు, జాకనంపేట గ్రామస్తులతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

■ దుష్ట శిక్షణ కోసం నారసింహుడు ఉద్భవించాడు



బోధన్‌టౌన్(బోధన్) : దుష్ట శిక్షణ కోసమే నారసింహుడు ఉద్భవించాడని బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. పట్టణంలోని బీటీ నగర్ కాలనీలో కోట మైసమ్మ లక్ష్మీసహిత నరసింహస్వామి కల్యాణ మహోత్సవం, జన్మదినాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి పిట్ల కృష్ణ మహరాజ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పసులోటి గోపీకిషన్, ప్రతమ్, భక్తులు పాల్గొన్నారు.

■ ఘనంగా ఎల్లమ్మ కల్యాణం



వర్ని (చందూర్): చందూర్ మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. పూజారులు, పోతరాజుల సమక్షంలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న రేణుకాఎల్లమ్మ ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారి కల్యాణం నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు రథోత్సవం, శుక్రవారం మధ్యాహ్నం కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు.

■ ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి వెంకటేశ్వర కాలనీలో గల వేంకటేశ్వర ఆలయ 31వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. గురువారం లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

బోధన్: సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో కలియతిరిగి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనవెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య ఉన్నారు.